# హుస్నాబాద్, ఎల్కతుర్తికి పశువైద్య భవనాలు

**రూ.1.40 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో పరిపాలన అనుమతులు**



హుస్నాబాద్,జనత న్యూస్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఏరియా పశువైద్యశాలతో పాటు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం ములకనూరు పశువైద్యశాల నూతన భవన నిర్మాణాలకు ప్రభుత్వం రూ.1.40 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంగళవారం పరిపాలనా అనుమతులు ఇస్తూ జి.ఓ.ఆర్.టి. నెం.36 ద్వారా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.స్థానిక పశుపోషక రైతులకు ఆధునిక సౌకర్యాలతో మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ నిధులను కేటాయించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక కృషితో ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో పశుసంపద అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆధునిక సదుపాయాలతో నిర్మించబోయే ఈ నూతన భవనాలు పశుగ్రాస, వైద్య సేవల బలోపేతానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రజాపాలనలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని స్పష్టం చేశారు. నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర అవతరణ వేడుకల్లో అంబేద్కర్‌ను విస్మరించిన అధికారులు

**ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోనగిరి మహేందర్.**



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండా వద్ద రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని అధికారులు పెట్టకుండా విస్మరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, న్యాయవాది బోనగిరి మహేందర్ పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగం అధికరణ 3 ప్రకారం చిన్న రాష్ట్రాల ఆవశ్యకతను వివరించిన అంబేద్కర్ చిత్రపటాన్ని జాతీయ జెండా వద్ద పెట్టకపోవడం బాధాకరమని, ఇలాంటి సంఘటనలు చదువుకున్న అధికారులు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు.

## మరణించిన రైతు కుటుంబాలకు భరోసా

**మిల్క్ డైరీ బెజ్జంకి ప్రెసిడెంట్ ఎలిగే సతీష్.**



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రానికి చెందిన పాడి రైతులు పుర్మ లచ్చిరెడ్డి, గుబిరే రాజయ్యలు ఇటీవల మరణించగా మంగళవారం కరీంనగర్ మిల్క్ డైరీ చైర్మన్ రాజేశ్వరరావు చేతుల మీదుగా మృతుల కుటుంబ సభ్యులకు 50వేల రూపాయల చొప్పున ఇన్సూరెన్స్ పాడి రైతు భరోసా చెక్కులను పంపిణీ చేసినట్లు బెజ్జంకి మండల కరీంనగర్ మిల్క్ డైరీ ప్రెసిడెంట్ ఎలిగే సతీష్ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు పాడి రైతులు మరణిస్తే ఇలాంటి ఇన్సూరెన్స్ లు రైతు కుటుంబానికి భరోసాగా ఉంటుందని, ఇలాంటి కార్యక్రమాలతో పాటు రైతుల ఆడపిల్లల పెళ్లిళ్లకు పుస్తె మట్టెలు పంపిణీ చేస్తూ , కరీంనగర్ మిల్క్ డైరీ రైతులను ప్రోత్సహిస్తూ వారికీ భరోసా కల్పిస్తుందని కొని ఆడారు.

# ఉద్యమకారుల ర్యాలీ విజయవంతం

**క్యాంప్ కార్యాలయం వద్ద అడ్డుకున్న పోలీసులు**



హుస్నాబాద్,జనత న్యూస్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ ఉద్యమకారుల ర్యాలీ ఉద్రిక్తతల నడుమ సాగింది. అంబేద్కర్ చౌరస్తా నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంప్ కార్యాలయానికి వినతిపత్రం అందించేందుకు బయలుదేరిన ఉద్యమకారులను పోలీసులు క్యాంప్ ఆఫీస్ సమీపంలో అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ఉద్యమకారుల సమస్యలను తెలియజేసేందుకు వెళ్తే అడ్డుకోవడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కార్యాలయంలో లేకపోవడంతో ఆయన ఓఎస్డీకి వినతిపత్రాన్ని అందజేశారు.తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నప్పటికీ, ఆ కమిటీని కేవలం రాజకీయ పరిమితుల్లో కాకుండా ఉద్యమ సంస్థల ప్రతినిధులు, మేధావులు, నిపుణులతో విస్తరించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.జేఏసీ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గుర్తింపు కమిటీలో రిటైర్డ్ జడ్జి, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను సభ్యులుగా చేర్చితే పారదర్శకత పెరుగుతుందన్నారు.కేసులతో సంబంధం లేకుండా నిస్వార్థంగా ఉద్యమంలో పాల్గొన్న వారిని గుర్తించాలని సూచించారు.కో కన్వీనర్ మేకల వీరన్న యాదవ్ మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలు, నెలకు రూ.25 వేల పెన్షన్, ఉచిత విద్య, వైద్యం, ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఉద్యమం కారణంగా ఉద్యోగ అవకాశాలు కోల్పోయిన వారికి వయస్సుతో సంబంధం లేకుండా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.మరో కోకన్వీనర్ ద్యాగల సారయ్య మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారుల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.ర్యాలీలో తెలంగాణ జనసభ, తెలంగాణ ప్రజాఫ్రంట్, ప్రజాసంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్, సీపీఐ, అంబేద్కర్ సంఘాల నాయకులు, ఉద్యమకారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, రైతు, కార్మిక, విద్యార్థి, యువజన, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో పాటు కోయ్యడ కొమురయ్య, సుధీర్‌బాబు, ఎం.ఏ. అన్వర్, వంగ వెంకట్రాంరెడ్డి, ఐలేని మల్లికార్జునరెడ్డి, ఎడబోయిన తిరుపతిరెడ్డి, గడిపే మల్లేష్, గాదెపాక రవీందర్, బత్తుల చంద్రమౌళి, పెట్టెం కుమారస్వామి, కన్నోజు రామకృష్ణ, బండి రమణారెడ్డి, లకావత్ మానస, సూరంపల్లి పరుశురాం, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, చెప్యాల ప్రకాశ్, వేముల జగదీశ్, ఐలేని సంజీవరెడ్డి, గూడెం లక్ష్మి, పచ్చిమట్ల రవీందర్ గౌడ్, చిత్తారి శ్రీనివాస్, తొందూరి ఎల్లయ్య, నాంపల్లి సమ్మయ్య, వికాస్ యాదవ్, హరీష్, కండె సుధాకర్, ప్రభాకర్‌రెడ్డి, రాజలింగం నాయక్, బుర్ర శ్రీనివాస్ గౌడ్, అశోక్‌బాబు, కవ్వ వెంకట్రాంరెడ్డి, శ్యామ్‌గౌడ్, చక్రపాణి, భాస్కర్ నాయక్, ప్రవీణ్, కల్లెం లక్ష్మణ్, దొంతరాబోయిన శ్రీనివాస్, అరవింద్ గౌడ్, గద్దల రమేష్, బండి పుష్ప, స్వరూప, రజని, ఎల్లవ్వ, పత్తెం రమేష్, బూర వెంకన్న, లక్ష్మణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





# అల్ఫోర్స్‌లో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



కరీంనగర్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అల్ఫోర్స్ విద్యాసంస్థలు ఘనంగా నిర్వహించాయి. స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు అమరవీరులు, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రజల దీర్ఘకాల ఆకాంక్షకు ప్రతిరూపమని, అనేక మంది అమరవీరుల త్యాగాలు, ప్రజల పోరాటాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. తెలంగాణ ఏర్పాటుతో రాష్ట్ర వనరులు ప్రజల అభివృద్ధికి వినియోగమవుతున్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వివక్ష ఎదుర్కొన్నప్పటికీ తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని తెలిపారు. ప్రస్తుతం యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిన కాళోజీ నారాయణరావు, దాశరథి, సురవరం ప్రతాపరెడ్డి, చాకలి ఐలమ్మ, కొమరం భీమ్ వంటి మహనీయుల సేవలను ఈ సందర్భంగా స్మరించారు. తెలంగాణ సాధనలో అల్ఫోర్స్ విద్యాసంస్థల పాత్ర కూడా విశేషమని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా ఉపాధ్యాయులు తెలంగాణ గేయాలను ఆలపించగా, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు ఉపాధ్యాయులు నృత్య ప్రదర్శనలు నిర్వహించి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మలిదశ ఉద్యమానికి సిద్ధం కావాల్సిందే

**స్థూపం వద్ద నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే రసమయి**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : కాంగ్రెస్ పాలనలో మళ్లీ సమైక్యవాదులో పెత్తనం కొనసాగుతుందని, అందుకే మరోసారి మలిదశ ఉద్యమానికి మనమంతా సిద్ధం కావాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పిలుపునిచ్చారు. మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో సర్పంచ్ పొన్నం సునీత ఆధ్వర్యంలో జాతీయ జెండాను, పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాల్గొని మాట్లాడుతూ బీఆర్ఎస్ అదినేత కేసీఆర్ పోరాట స్ఫూర్తితో 14ఏళ్ల పాటు కొనసాగిన ఉద్యమంలో మనమంతా పాల్గొనడం, 2014లో తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం గర్వంగా ఉందన్నారు. ఎందరో అమరుల త్యాగ ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, స్వయం పాలనలో కేసీఆర్ నేతృత్వంలో పదేళ్లలో రాష్ట్రం ప్రపంచం గర్వపడేలా అభివద్ధి చెందిందని అన్నారు. ఎందరో ప్రాణ త్యాగం చేసినారని, ఉద్యోమంలో ఎందరో భాగస్వాములు అయ్యారని, మహా సంగ్రామంగా ఉద్యమం కొనసాగిందని, స్వేచ్ఛా వాయువును పీల్చుకోవడానికి 14 ఏళ్ల పాటు ఉద్యమించామని అన్నారు. మనం సాధించుకున్న తెలంగాణను కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. అంతకుముందు ఎల్ఎండి కాలనీ లోని అమరవీరుల స్తూపం వద్ద రసమయి తో పాటు నాయకులు పూలు వేసి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం తిమ్మాపూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మడంల అధ్యక్షుడు రావుల రమేష్ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాలలో సర్పంచు పొన్నం సునీత, కార్పొరేటర్ కాల్వ మల్లేశ్, సొసైటీ అధ్యక్షుడు సింగిరెడ్డి స్వామిరెడ్డి, నాయకులు రావుల రమేష్, కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, పొన్నం అనిల్ గౌడ్, ఉల్లెంగుల ఏకానందం, నాయిని వెంకట రెడ్డి, పాశం అశోక్ రెడ్డి, ల్యాగల వీరారెడ్డి, ఎడ్ల బుచ్చిరెడ్డి, పోరరాజు దేవేందర్, సల్ల మహేంధర్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అమరవీరుల త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం

**కాంగ్రెస్ హామీలను వెంటనే అమలు చేయాలి**

**ఉద్యమకారులను నిర్లక్ష్యం చేస్తే మరో ఉద్యమం తప్పదు**

**తెలంగాణ కోసం త్యాగం చేసిన కుటుంబాలకు బీఆర్ఎస్ అండ**

**కళాకారులకు ఉద్యోగాలు కల్పించిన ఘనత కేసీఆర్‌దే**

**రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం**

**త్వరలో హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు**

**మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**





హుస్నాబాద్,జనత న్యూస్:అమరవీరుల ప్రాణత్యాగాలు, తెలంగాణవాదుల పోరాటాలు, అన్ని వర్గాల ప్రజల ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.1969 నుంచి 2014 వరకు తెలంగాణ సాధన కోసం అనేక మంది ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేశారని పేర్కొన్నారు. 2001లో కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభమైన ఉద్యమం రాష్ట్ర సాధన వరకు నిరంతరంగా కొనసాగిందన్నారు. 2009లో కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటుపై ప్రకటించి వెనక్కి తగ్గడంతో ఉద్యమం ఉధృతమైందని, అనంతరం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు సైతం ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.ఎన్నికల ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తూ ఉద్యమకారులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే వారితో కలిసి మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోయినా, కనీసం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలనైనా నెరవేర్చాలని కోరారు.త్వరలో హుస్నాబాద్ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అమరవీరుల ఆశయాల సాధనే బీజేపీ లక్ష్యం: చింతం శ్రీనివాస్



కరీంనగర్, జూన్ 2: తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన, బంగారు తెలంగాణ నిర్మాణమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని బీజేపీ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తిమ్మాపూర్ మండలంలోని మహాత్మా నగర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన చింతం శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రజల దశాబ్దాల పోరాటం, వేలాది మంది అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు భారతీయ జనతా పార్టీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. 1997 కాకినాడ తీర్మానం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ప్రకటించిన తొలి జాతీయ పార్టీ బీజేపీ అని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందడంలో మాజీ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ పాత్ర చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కొందరి కుటుంబాల కోసం కాకుండా అమరవీరుల ఆశయాల సాధన కోసం ఏర్పడిందని పేర్కొన్నారు. 'నీళ్లు, నిధులు, నియామకాలు' లక్ష్యంగా సాగిన ఉద్యమ ఫలితాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందలేదని విమర్శించారు. నిరుద్యోగం, అవినీతి, పేదరికం ఇంకా కొనసాగుతున్నాయని అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, వైద్య, విద్యా సంస్థల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. అమరవీరుల కుటుంబాలకు న్యాయం చేయడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడమే బీజేపీ ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, జిల్లా నాయకులు, మండల కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## మండల వ్యాప్తంగా ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంతో పాటు, వివిధ గ్రామాలలో ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరణ చేసి, తెలంగాణ అమరవీరులను స్మరించుకొని నివాళులర్పించారు. మండల కేంద్రంలో ప్రధాన పార్టీల మండల అధ్యక్షులు జాతీయ జెండా ఎగురవేసి ఆయా పార్టీల శ్రేణులతో సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాకాల మహిపాల్ రెడ్డి, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కొలిపాక రాజు వారి వారి పార్టీ కార్యాలయాలలో జాతీయ జెండా ఆవిష్కరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ శ్రీకాంత్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్, పోలీస్ స్టేషన్ లో ఎస్సై తోట తిరుపతి జెండా ఆవిష్కరించి సిబ్బందితో కలిసి వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఆయా గ్రామాల సర్పంచులు జాతీయ జెండా ఎగరవేశారు.







## తెలంగాణ సంస్కృతిని ముందుకు తీసుకెళతాం

**అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది**

**ఢిల్లీలో తెలంగాణ అవతరణ వేడుకల్లో నితిన్ నబీ**



**న్యూఢిల్లీ,జూన్2 :** తెలంగాణ అభివృద్ధి, సంస్కృతిని ముందుకు తీసుకువెళ్లాలన్నది బీజేపీ సంకల్పం' అని బిజెపి జాతాయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది. పీఎం కిసాన్ యోజన ,ముద్ర లోన్లు, జన్ ధన్ ఖాతాలు అందించాం. మౌలిక వసతులు,రోడ్లు,రహదారులు,రైల్వేలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. వికసిత భారత్ కావాలంటే వికసిత తెలంగాణ కావాలి. ఒక అవినీతి పరుడు చేతుల్లోంచి మరో అవినీతి పరుడి చేతుల్లోకి వెళ్ళింది. తెలంగాణ కలలును సాకారం చేస్తాం' అని నితిన్ నబీన్ పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అలానే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఢిల్లీలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, టీజీ బీజేపీ చీఫ్ రామచందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నితిన్ నబీన్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, ప్రజల పోరాట స్ఫూర్తిని కొనియాడుతూ, అభివృద్ధి పథంలో రాష్ట్రం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చిన్న రాష్ట్రాల అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలు ఏర్పాటు చేశాం. తెలంగాణ అభివృద్ధి కోసం రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చాం. తెలంగాణ అమరవీరులకు నివాళులర్పిస్తున్నా. అమరవీరుల కలలు కన్న రీతిలో ఇంకా రాష్ట్రం వెనుకబడి ఉంది. చిన్నమ్మ సుష్మా స్వరాజ్ తెలంగాణ ఏర్పాటుకు కృషి చేశారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారు అధికారంలో ఉన్నారు. రాష్టా అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది. జార్ఖండ్ ఏర్పాటు సమయంలో జార్ఖండ్ ఏర్పాటు కానివ్వం అన్నవారే ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నారు.

## నిత్యావసర ధరలు తగ్గించాలి : సీపీఐ నేత గడిపె మల్లేశ్

హుస్నాబాద్,జనత న్యూస్: నిత్యావసర వస్తువుల ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపీపీ గడిపె మల్లేశ్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మల్లేశ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి నిజమైన పేదల అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలకు చేరే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు.కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి నిత్యావసర వస్తువుల ధరలను పెంచుతున్నప్పటికీ, ప్రభుత్వం వాటిని నియంత్రించడంలో విఫలమవుతోందని విమర్శించారు.పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ధరలను అదుపులోకి తెచ్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రోళ్ల భాగ్య, మండల నాయకులు ఎనగందుల లక్ష్మీనారాయణ, పిట్టల మొగిలయ్య, బింగి సమ్మయ్య, అయిలేని మల్లారెడ్డి, మహ్మద్ అంకుశావలి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ గుంటిపెల్లి లక్ష్మి, దొంతరబోయిన రాజవ్వ, పెద్ది నిర్మల, చొక్కం ఎల్లవ్వ, దొంతరబోయిన రజిత తదితరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com